సాక్షి శ్రీకాకుళం

శనివారం । 28 । జనవరి । 2023



స్వర్ణ సూర్యుడు

కాశీబుగ్గ: రథ సప్తమి వేళ బంగారపు సూరీడును కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి రమేష్‌ఆచారి తయారు చేశారు. ఒక సెంటీమీటరు ఎత్తులో 100 మిల్లీగ్రాముల స్వర్ణం ఉపయోగించారు.



ఉద్దానంలో ఎలుగు సంచారం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం, తీర ప్రాంతాల్లో ఎలుగులు స్వైర విహారం చేస్తున్నాయి. శుక్రవారం చినవంక రోడ్డుపై ఎలుగు సంచరించడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు.

నెమలికొండ యాత్రకు సన్నాహాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండపై 1న జరగనున్న యాత్రకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలతో పాటుగా వేలమందికి అన్నదానం చేయనున్నారు.

న్యూస్‌రీల్

నెమలి పింఛంపై ఆదిత్యుని రూపం



నెమలి పింఛంపై ఆదిత్యుని రూపం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని చిత్తరంజన్ వీధిలో నివాసముంటున్న వాడాడ రాహుల్ పట్నాయిక్ రథసప్తమిని పురస్కరించుకొని అరసవల్లి సూర్యనారాయణ స్వామి (ఆదిత్యుడు) నిజరూపాన్ని నెమలి పింఛంపై వేసి ప్రతిభను చాటుకున్నారు. గతంలో తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని కూడా ఈయన నెమలి పింఛంపై తీర్చిదిద్దారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్ తో పాటుగా 75వ స్వాతంత్ర్య వేడుకల్లోనూ దేశ జాతీయ పతాకాన్ని అందంగా తన కుంచెతో చిత్రీకరించి పలువురి ప్రశంసలు పొందారు. ఈ చిత్రాలను తాను కేవలం రెండు మూడు గంటల్లో వేశానని రాహుల్ తెలిపారు.

రథసప్తమికి 10 ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆర్టీసీ 10 ప్రత్యేక బస్సులను నడుపుతుందని ఆర్టీసీ ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. విశాఖపట్టణం, బొబ్బిలి, రాజాం తదితర రూట్ల నుంచి వచ్చే భక్తుల కోసం సింహద్వారం వద్ద నుంచి అరసవల్లి కూడలి వరకూ 6 బస్సులు, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అరసవల్లి కూడలి వరకూ 4 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. రద్దీ దృష్ట్యా అదనపు బస్సులను కూడా నడపనున్నట్లు శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మ లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గొర్రెల మందను ఢీ కొని డిగ్రీ విద్యార్థి దుర్మరణం



మృతి చెందిన తేజేశ్వరరావు(ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిపై జర్జంగి వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థి దేవాడ తేజేశ్వరరావు (19) మృతి చెందగా, మరో ఇద్దరు డిగ్రీ విద్యార్థులు విజయ్ పట్నాయక్, సాయి సుమంత్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తేజేశ్వరరావు తన స్నేహితులు విజయ్ పట్నాయక్, సాయి సుమంత్‌తో కలిసి గురువారం బైక్‌పై నరసన్నపేట మండలం దేవాదిలోని తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో తిరిగి స్వగ్రామానికి చేరుకునేందుకు బైక్‌పై వస్తుండగా జర్జంగి వద్ద గొర్రెల మంద అడ్డంగా రావడంతో మంచులో అవి కనిపించక అమాంతం ఢీకొట్టారు. దీంతో అంతా కిందపడిపోయారు. తేజేశ్వరరావు మృతి చెందగా, మిగిలిన వారికి దెబ్బలు తగిలాయి. వీరికి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు. తేజేశ్వరరావు మంచి క్రికెటర్.

అధికారులపై కలెక్టర్ మండిపాటు



కొరసవాడ గ్రామ సచివాలయ నిర్మాణ భవనం పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పాతపట్నం: జిల్లాలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పాతపట్నం మండలంలోని కొరసవాడ, బూరగాం గ్రామ సచివాలయం, కొరసవాడ, గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే పనులు పూర్తి కావడం లేదని అన్నారు. దీంతో మండల ఇంజినీర్ టి.ప్రసాద్‌రావుకు సస్పెన్షన్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు. కొరసవాడ గ్రామ సచివాలయ నిర్మాణంలో బిల్లులు సకాలంలో అందాయని, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల గత ఎనిమిది నెలల నుంచి భవన నిర్మాణం పనులు చేపట్టడం లేదన్నారు. కొరసవాడ ఆర్‌బీకేలో రైతులకు అందిస్తున్న ఎరువులను పరిశీలించి, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. తక్కువ డబ్బులకే ఎరువులు అందిస్తున్నారని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. పాతపట్నంలోని శ్రీనీలకంఠేశ్వర ఆలయం సమీపంలోని రైతుల పంట పొలాలను, తెంబూరులోని పొలాలను కలెక్టర్ రైతులతో కలిసి పరిశీలించారు.

అరుదైన క్షేత్రం.. ఆదిత్య ధామం

విగ్రహం నుంచి నైవేద్యం వరకు.. ఊరేగింపు నుంచి ఉత్సవం వరకు.. ఆవిర్భావం నుంచి వర్తమానం వరకు.. అన్నింటా ఆదిత్య క్షేత్రం అపురూప దివ్యధామంగా విరాజిల్లుతోంది. సూర్యుడికి గుడి కట్టడం, ఆ కోవెలను దండయాత్రల్లో కూలగొట్టడం, ఆపై మళ్లీ స్వామిని పునఃప్రతిష్ఠించడం, ఆ ఆలయం అంచెలంచెలుగా ఎదిగి పుణ్యక్షేత్రంగా మారడం అన్నీ ఈ స్థల ప్రాశస్త్యానికి ప్రతీకలే. ఇంద్రుడి నుంచి ఇప్పిలి వంశీయుల వరకు అంతా స్వామిని పూజించి తరించిన వారే. గంగరాజుల నుంచి వరుదు వారి వరకు అందరూ తరతరాలుగా స్వామిని పునఃప్రతిష్ఠించుకుని కాపాడుకున్న వారే. రథసప్తమి నాడు అరసవల్లి కీర్తిని పరిశీలిద్దాం రండి. – అరసవల్లి



కనరో భాగ్యము..



ఏడు గుర్రాలు ..ముగ్గురు భార్యలతో అరసవల్లి క్షేత్రంలో శ్రీవారు కొలువుదీరారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవి అనే ముగ్గురు భార్యలతో సూర్యభగవానుడు శాలిగ్రామ ఏక శిలతో విగ్రహరూపుడై ఉంటారు. స్వామి సింహలగ్న జాతకుడైనందున ఆయన విరాట్టుపై సింహతలాటం ఉంటుంది. రెండు హస్తాలతో తామర పద్మాలను పట్టుకుని ఉంటారు. స్వామివారికి సనక, సనందులు అనే ఇద్దరు సేవకులు నిత్యం.. ఛత్ర, ఛామరలతో స్వామికి సేవ చేస్తుంటారు. స్వామివారి నడుముకు చురిక (చిన్న కత్తి) ఉంటుంది. తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఇలానే చురిక ఉంటుంది.

శతాబ్దాల చరిత..




గంగ వంశరాజు గుణశర్మ వారసుడైన కళింగరాజు దేవేంద్రవర్మ క్రీస్తు శకం63 సంవత్సరంలో ఈదేవాలయాన్ని నిర్మించారని ఇక్కడ లభించిన శాసనాలు చెబుతున్నాయి. 7వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం దేవేంద్రునిచే నిర్మితమైందని పురాణాలు చెబుతున్నాయి. క్రీస్తు శకం 16వ శతాబ్దంలో హర్షవల్లిని పాలించిన పాలకులు ఈ ఆలయాన్ని ధ్వంసం చేసినట్లుగా ఒక శాసనంలో పేర్కొనబడి ఉంది. ఆ సంస్థానంలో ఉద్యోగిగా ఉన్న సీతారామస్వామి అనే పండితుడు, హర్షవల్లిపై దాడి జరుగుతుందన్న విషయం ముందే తెలుసుకుని, ఆలయంలోని మూలవిరాట్టును తీసుకుని సమీపంలోని ఒక బావిలో పడేసారట. కొన్నేళ్ల తర్వాత అనగా క్రీస్తు శకం 1778వ సంవత్సరంలో ఎలమంచిలి పుల్లాజీ పంతులు ఆ బావిలో మూలవిరాట్టును కనుగొని, తర్వాత ధ్వంసమైన ఆలయాన్ని పునర్నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

కిరణ స్పర్శ..



మూలవిరాట్టు ఉన్న స్థానబలమో, స్వామి వారి మహిమ వల్లనో గానీ, ప్రతి ఏటా ఉత్తరాయన, దక్షిణాయన కాలమార్పుల్లో నేరుగా తొలి లేత కిరణాలు నేరుగా స్వామి వారి మూలవిరాట్టును ప్రతి భాగమూ స్పృశించడం ఇక్కడి క్షేత్ర మహత్యంగా చెప్పుకుంటారు. ఈ లెక్కన ప్రతి ఏటా మార్చి 9,10 తేదీల్లోనూ, అలాగే అక్టోబర్ 1,2 తేదిల్లోనూ స్వామి వారిని సూర్య కిరణాలు తాకుతుంటాయి. ఆరోగ్యం కోసం ఇక్కడ సూర్యనమస్కార పూజలు చేస్తూ స్వామిని నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండడంతో సూర్యక్షేత్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది.

నభోమూర్తి నగధగలు



వెలుగుల రేడు ప్రత్యేక పర్వదినాల్లో స్వర్ణకాంతుల్లో దర్శనమిస్తుంటారు. 3.361 కేజీల బంగారంతో మకర తోరణాన్ని స్వామి వారికి భక్తులు సమకూర్చారు. అలాగే స్వామి వారికి 18 కేజీల బంగారు, 540 కేజీల వెండి ఆభరణాలు ఉన్నాయి.

నాడు హర్షవల్లి.. నేడు అరసవల్లి

దేశంలోనే నిత్య పూజలందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా అరసవల్లి విరాజిల్లుతోంది. శతాబ్దాల క్రితం నుంచి ఆరోగ్యం కోసం ఇక్కడ పూజలు చేసేవారు. ఇంద్రపుష్కరిణిలో స్నానాలు చేసి సూర్యనమస్కారాలు చేసేవారు. ఆరోగ్యం సిద్ధించడంతో సంపూర్ణ హర్షంతో తిరిగి వెళ్లేవారు. అందుకే ఈ క్షేత్రాన్ని హర్షవల్లి అని పిలిచేవారు. అదే అరసవల్లిగా మారింది.

వరుదు వంశీయుల ఉదారత్వం.. ఇప్పిలి వంశీయుల అర్చకత్వం



1999లో ప్రముఖ గ్రానైట్ వ్యాపారి దివంగత వరుదు బాబ్జీ దంపతులు ఆలయ వాస్తు నిర్మాణం దెబ్బతినకుండా గర్భగుడి పై విమానాన్ని పడగొట్టి, దక్షిణాది పద్ధతిలో కాకుండా ఓఢ్ర (ఒడిశా) సంప్రదాయంతో పునర్నిర్మించారు. రథం ఆకృతిలో ఈ నిర్మాణం దర్శనమిస్తుంది.

- దేవాలయంలో ఇప్పిలి వంశీయులు అర్చకత్వం చేస్తున్నారు.

నిజ భాస్కరం క్షీర సోయగం



- అద్భుతం ఆదిత్యుని నిజరూపం
- అర్ధరాత్రి క్షీరాభిషేకానికి పోటెత్తిన భక్తజనం
- పట్టువస్త్రాలను సమర్పించిన దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్

లోకమంతా నిదురపోతున్న వేళ అరసవల్లి మేలుకొంది. చంద్ర కిరణాలతో భూమి వెలుగు వెతుక్కుంటున్న సమయాన సూర్య భగవానుడి అభిషేకానికి సిద్ధమైంది. నడి రేయిలో.. వేల కళ్ల సమక్షంలో ఆదిత్యుడు కొలువైన అరుణ శిల శ్వేతవర్ణంలోకి మారేలా క్షీరధారలు స్వామిపై వర్షించాయి. అలంకరణలేవీ లేని ఆ అపురూప క్షణాల్లో స్వామి నిజరూపం అపురూపమై సాక్షాత్కరించింది. రథ సప్తమి పుణ్య ఘడియల్లో అరసవల్లి ఆదిత్యుడి క్షీరాభిషేకం, నిజరూప దర్శనం చేసుకుని భక్తకోటి తరించింది.

అరసవల్లి:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో రథసప్తమి వేడుక మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ప్రత్యేక క్షీరాభిషేక సేవ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదిత్యునికి పట్టువస్త్రాలను దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ అర్చకుల బృందం స్వామికి సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళ ధ్వానాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాన ఉత్సవ అధికారి, ఆర్జేసీ ఎంవీ సురేష్ బాబు, ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగిసన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పునర్నిర్మాత 'వరుదు' కుటుంబీకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షీరాభిషేకం చేసి అనంతరం స్వామి విశిష్టతను భక్తులకు అర్చకులు వివరించారు. రూ.500 టిక్కెట్ల దర్శన మార్గంలో క్షీరాదిత్యున్ని దర్శించుకోవడానికి తండోపతండాలుగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అపురూప నిజరూప దర్శనాన్ని తిలకించి పులకించిపోయారు.



ఆదిత్యునికి క్షీరాభిషేకం (ఫైల్)



అర్ధరాత్రి వేళ భక్తుల రద్దీ



క్యూలో భక్తులు



స్వామి వారి పూజలో దేవాదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కిల్లి కృపారాణి తదితరులు

1200 మందితో బందోబస్తు: ఎస్పీ



ఆలయ దర్శనానికి సంబంధించి అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రథసప్తమికి వచ్చే భక్తుల కోసం 1200 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఆమె శుక్రవారం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తును రెండు సెక్టార్లుగా విభజించామని, ఒకటో సెక్టారు కింద ట్రాఫిక్, రెండో సెక్టారు కింద లా అండ్ ఆర్డర్ చూసుకుంటామన్నారు. భక్తుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, వృద్ధులు వికలాంగులు, బాలింతలు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చూడాలని సూచించారు.

భక్తులకు ప్రథమ చికిత్స అందించాలి

శ్రీకాకుళం రూరల్: రథ సప్తమి సందర్భంగా అరసవల్లిలోని వివిధ ప్రాంతాల్లో విధుల్లో ఉండే డాక్టర్లు భక్తులకు అత్యవసరంగా ఏదైనా ప్రమాద సంఘటనలు జరిగితే తక్షణమే ప్రథమ చికిత్స అందించేలా పనిచేయాలని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయంలో పలువురు డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దర్శనానికి వస్తారని, ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఓపికతో చికిత్స చేయాలన్నారు.

సూర్యనారాయణుడి సేవలో...





హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ దంపతులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్‌కు స్వామివారి చిత్రపటాన్ని, అందజేస్తున్న ఈఓ హరి సూర్యప్రకాశ్, ప్రధాన అర్చకులు శంకర్ శర్మ







ఎమ్మెల్సీ దువ్వాడ, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మామిడి శ్రీకాంత్



ఆలయంలో సన్నాయి మేళం

క్లుప్తంగా

మిసెస్ ఇండియా పోటీలకు పైడి రజిని


పైడి రజిని

శ్రీకాకుళం: రాజస్థాన్‌లోని రణతంబోర్‌లో ఈ నెల 29 నుంచి జరగనున్న మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్, మిసెస్ ఏవీఎస్ కళాశాల ఇంగ్లిష్ హెచ్‌ఓడీ, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజిని హాజరుకానున్నారు. గత ఏడాది మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టైటిల్ గెలుచుకున్న ఈమె జాతీ య పోటీల్లోనూ ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ఆమె పాల్గొంటారు. శాస్త్రీయ నృత్యం, ప్రాంతీయ నృత్యం, ప్రాంతీయ వంటకాలు, శాస్త్రీయ వేషధారణ, దేశంపై సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల నిర్వహణపై నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో 29 రాష్ట్రాల నుంచి మహిళలు పాల్గొననున్నారు.

కదంబం వ్యాస సంపుటి ఆవిష్కరణ


వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఢిల్లీశ్వరరావు రాసిన కదంబం పరిశోధనాత్మక వ్యాస సంపుటిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పరిశోధనాత్మక కథనాలు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తాయని తెలిపారు. విద్యార్థుల ప్రగతికి సైతం రచనలు దోహదపడతాయన్నారు. అధ్యాపకులు బోధనలతో పాటు జర్నల్స్, పరిశోధనలపై దృష్టి పెట్టాలని చెప్పారు. విజ్ఞాన సముపార్జన ద్వారా ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని వివరించారు.

భర్తపై రోకలితో దాడి

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో భర్తపై భార్య దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన జి.చందన రోకలితో తనపై దాడి చేసిందని భర్త నాగార్జున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ కృష్ణ తెలిపారు. గాయాలైన నాగార్జునను కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేశారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. అదనపు కట్నం కోరుతున్నాడని చందన భర్తపై పోలీసులకు ఇదివరకే ఫిర్యాదు చేశారు. దీనిపైనే ఘర్షణ జరిగి భార్య రోకలితో దాడి చేసినట్లు నాగార్జున పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు. చందన కూడా తన భర్తపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఆర్టీసీ రిజర్వేషన్ చార్జీల తగ్గింపు

శ్రీకాకుళం అర్బన్: ప్రయాణికులపై రిజర్వేషన్ భారం పడకుండా ఉండేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఆర్టీసీలో ముందస్తు టికెట్‌లు రిజర్వేషన్ చేసుకుంటే రూ20 వసూలు చేసేవారు. ఈ రిజర్వేషన్ చార్జీ రూ.20 నుంచి రూ.5కు తగ్గించినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట తదితర ప్రాంతాల నుంచి విశాఖపట్టణంకు, విశాఖపట్టణం నుంచి ఇచ్ఛాపురానికి వెళ్లే అన్ని సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులలో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.



● నింగి నుదుట తిలకం

నీరు లేని ఉప్పుటేరు ఉదయ కాంతుల్లో మెరిసిపోయింది. చీకట్ల తెర తొలిగిన వేకువ వేళ ఇలా అందమైన సూర్యోదయం ఉప్పుటేరు సాక్షిగా ఆవిష్కృతమైంది.
– ఇచ్ఛాపురం రూరల్

● ఎండి'నది'


వంశధారలో ఇసుక తిన్నెలు బయటకు వస్తున్నాయి. నీరు ఎండిపోవడంతో చెవ్వాకులపేట గ్రామం సమీపంలో ఉన్న నది ఇలా బోసిగా కనిపిస్తోంది. -ఆమదాలవలస రూరల్

వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటు

● జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పిరియా విజయ


మాట్లాడుతున్న పిరియా విజయ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టడానికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పనున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం 2, 4, 7, 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు భరోసా ఇవ్వడానికి స్పెషల్ ఎకనామిక్ జోన్ తరహాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం, పైడిభీమవరం మధ్య 5000 ఎకరాల్లో స్పెషల్ ఎకనామిక్ జోన్ పెట్టేందుకు అనుకూలంగా ఉందన్నారు. ఈ పారిశ్రామిక వాడకు తూర్పున బంగాళా ఖాతం, టెక్కలి భావనపాడు నౌకాశ్రయం దక్షిణాన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పడమ రన జాతీయ 6 లైన్ల రహదారి, భారత్ రైల్వే రవా ణా మార్గం ఉపయోగపడతాయన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించేందు కు జిల్లా ప్రజా పరిషత్ రెండోస్థాయీ సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు.

దీంతో ఈ అంశాన్ని రాబోయే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అజెండాలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులతో పాటు జాతీయ టూరిస్టులను ఆకర్షించే ఉద్దేశంతో శ్రీకాకుళం, విశాఖపట్నం మూడు జిల్లాల్లోని బౌద్ధారామాల అనుసంధానం, కళింగపట్నం బీచ్‌లో మౌలిక వసతులు కల్పించి 'బుద్ధిస్టిక్ సర్క్యూట్' టూరిజం అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్ర టూరిజం శాఖతో సంప్రదించి మహేంద్ర గిరిపై 'ట్రెక్కింగ్ టూరిజం' ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణసంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న జగనన్న కాలనీలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం 4వ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారితో సమీక్షించారు. 1,7వ స్థాయీ సంఘాల్లో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర శాఖల ప్రగతి నివేదికలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

'ప్రవేశాలు మెరుగుపరచాలి'


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నాగరాణి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో మెరుగైన ప్రవేశాలు లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో క్లాస్‌వర్క్, ఇంటర్న్‌షిప్‌లపై మాట్లాడారు. అధ్యాపకులతో సమీక్ష నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు తక్కువగా జరుగుతున్నాయని, పెరిగేలా ప్రచారం చేయాలన్నారు. వారం రోజుల్లో పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పాలీసెట్-2023 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. మే 10న సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణతో పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కరోనా కారణంగా ప్రవేశాలు, క్లాస్‌వర్క్, ఫలితాల ప్లేస్ మెంట్‌లపై ప్రభావం చూపిందని, భవిష్యత్‌లో కరిక్యులమ్ గాడిన పడుతుందన్నారు. పక్కాగా క్లాస్‌వర్క్, పరిశ్రమల్లో శిక్షణ, విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లపై దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ప్రమాణాలకు లోబడి విద్యను అందిస్తామని అన్నారు. 10వ తరగతి తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించే పాలిటెక్నిక్‌కు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సప్లిమెంటరీ రాసే వారి కోసం ప్రత్యేక క్లాస్ నిర్వహిస్తున్నామన్నారు.

పాలిసెట్ దరఖాస్తుల ప్రవేశ రుసుం ఎస్సీ, ఎస్టీలకు రూ.100కు తగ్గించినట్లు చెప్పారు. బీసీ, ఓసీలకు రూ.400 అని తెలిపారు. ప్రభుత్వం అర్హులందరికీ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వర్తింపజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, సెక్రటరీ కె.విజయభాస్కరరావు, జాయింట్ సెక్రటరీ కె.నారాయణరావు, స్థానిక ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు పాల్గొన్నారు.

'నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు'


వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ఎల్.ఎన్.పేట: వంశధార పునరావాస కాలనీల్లో దేవాలయాల నిర్మాణం కోసం దేవదాయ శాఖ ద్వారా విడుదలైన నిధులు దుర్వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని టెక్కలి సబ్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని శ్యామలాపురం పునరావాస కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించారు. పునరావాస కాలనీలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం పాత గ్రామంలో ఆలయాలు ఉన్నట్లే పునరావాస కాలనీల్లోనూ ఆలయాల నిర్మాణం జరగాల్సి ఉందని, ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ బలగ లక్ష్మి చేసుకున్న విన్నపం మేరకు ఆయన కాలనీలో పరిశీలన చేశారు. పునరావాస కాలనీ పేరుతో హిరమండలం మండలంలోని ఓ ఆలయం పేరుతో నిధులు విడుదలయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఇక్కడ ఆలయం ఉంటే మరో చోట నిధులు ఎలా మంజూరు చేస్తారని ఆయన దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు.

పునరావాస కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి చెల్లించాల్సిన నిధులు ఎవరికీ సంబంధం లేని వ్యక్తి బ్యాంక్ ఖాతాలకు జమచేశారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అలా ఎందుకు చేశారో సమగ్ర వివరాలతో మంగళవారం టెక్కలిలోని తన కార్యాలయానికి వచ్చి తెలి యజేయాలన్నారు. నిధులు ఖర్చుల్లో తేడాలు ఉంటే ఉద్యోగాలు వదులుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పునరావాస కాలనీలో అంగన్‌వాడీ భవనం, పాఠశాల భవనం, పంచాయతీ భవనం, వంశధార హైలెవల్ కాలువపై కాలినడక వంతెన నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రేషన్ డిపోను మరో చోటుకు మార్చుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని అంగన్‌వాడీ కార్యకర్తను హెచ్చరించారు. ఆయనతో పాటు తహసీల్దార్ బీఎస్ఎస్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, ఈఓపీఆర్డీ జి శ్యామలాదేవి, బలగ గోవిందరావు, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వంశధార ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారుల దాడులు

జి.సిగడాం: ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచిన దుకాణాలపై దాడులు చేస్తున్నామని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం వెల్లడించారు. ఆయన శుక్రవారం పాలఖండ్యాం గ్రామంలో శివరామకృష్ణ ట్రేడర్స్, కావేరి ఎరువుల షాపులపై దాడులు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నామన్నారు. పాలఖండ్యాం మెయిన్ రోడ్డులోని శివరామ కృష్ణ ఎరువుల షాపు స్టాక్ రికార్డులో భారీ వ్యత్యాసం ఉండడంతో తనిఖీ చేశామన్నారు. ఈ షాపులో 15.425 మెట్రిక్ టన్నుల ఎరువులు తేడా ఉండటంతో సీజ్ చేశామని తెలిపారు. సంబంధిత యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఫిబ్రవరి 3న వైస్ ఎంపీపీ ఎన్నిక

గార: మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నిక ఫిబ్రవరి 3న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపిక చేయాలని ఉన్నతాధికారులు తెలిపారు. గార వైస్ ఎంపీపీ బరాటం రామశేషు మృతిచెందడంతో ఎన్నిక జరగాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు ఈ స్థానానికి కూడా ఎన్నిక జరగనుంది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

● భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు


సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారి కల్యాణం, ప్రత్యేక, విశేష సేవలు నిర్వహించి అశేష భక్తుల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేశారు. భక్తులు వేడుకకు భారీగా తరలివచ్చారు.

వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి : మండలంలోని దీనబంధుపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం సాయంత్రం మర్రిపాడు గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దీనబంధుపురం గ్రామానికి చెందిన లోకొండ భీమారావు (36), పాశాల రవీంద్ర(19) శుక్రవారం సాయంత్రం వారికున్న పాన్ షాపు కోసం సరుకులు తీసుకెళ్లడానికి మెళియాపుట్టి మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఊరికి వెళ్తుండగా.. మర్రిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. స్థానికులు 108 సాయంతో వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. రవీంద్రకు తలకు బలమైన గాయమైందని గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న మెళియాపుట్టి పోలీసులు ఆస్పత్రికి వెళ్లారు.

అర్హులైన దరఖాస్తుదారులకు వైఎస్సార్ కల్యాణమస్తు


సచివాలయంలో సిబ్బందితో వైఎస్సార్ కల్యాణమస్తుపై చర్చిస్తున్న పీడీ విద్యాసాగర్

నరసన్నపేట: జిల్లాలో ఇప్పటివరకూ వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో భాగంగా 81 దరఖాస్తులు వచ్చాయని వీరిలో అర్హులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. ఆయన శుక్రవారం నరసన్నపేటలో ఆయన దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేశా రు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో ఉన్న సచివాలయానికి వెళ్లి వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో దరఖాస్తుల వివరాలు, వాటిని ఎలా అప్‌లోడ్ చేస్తున్నారో ఆరా తీశారు.

అనంతరం సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అర్హులైన నూతన దంపతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీ కొండలరావు, ఏపీఎం హేమసుందర్ తదితరులు ఉన్నారు.